
# ఒక రాగం

నేటి నిజం... రిపబ్లిక్ డే స్పెషల్, 2002



"ఆ అనకాపల్లి పెళ్ళివారికి అమ్మాయి నచ్చిందట! కానీ, 'తాము పదిలక్షల వరకు కట్నం ఆశిస్తున్నాము. ఆలోచించి ఏ విషయం చెప్తే మిగతా వివరాలు మాట్లాడుకునేందుకు వస్తా'మని అబ్బాయి తండ్రి రాశాడు"

ఉత్తరాన్ని చదివి, మడిచి జేబులో పెట్టుకుంటూన్న బంగారయ్యగారి ముఖంలో ఆవేదన కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

"దీనిలో కొత్త ఏముంది! షరా మామూలేగా!!" వంటింట్లో గ్యాస్‌స్టవ్ మీదనుండి 'ప్రెస్టేజ్ కుక్కర్' దించుతూ అంటున్న అహల్య మాటల్లో నిరాశ లీలగా ప్రతిధ్వనిస్తోంది.

"ఈ సంబంధం తప్పనిసరిగా కుదురుతుందని ఆశపడ్డాను! కుర్రాడు కూడా మంచి విద్యావంతుడు. కానీ, అంత డబ్బు ఎక్కడి నుండి తేగలం చెప్పు?!" అన్నాడు.

"పదిలక్షల రూపాయలు చాలవన్నట్లు- మిగతా విషయాలు మాట్లాడుకునేందుకు వస్తారట! అంటే లాంఛనాలూ, కానుకలంటూ అందినంత వరకూ మరికొంత గుంజుకుందామనే దురాశ!"

దించిన కుక్కర్ విజిల్ అంతస్థాయిలో నిర్వేదనగా అంటున్న తల్లిమాటల్ని నిరాశగా ఆలకిస్తోంది అంజన.

"అబ్బాయి ఐఐటి పాసై, మంచి ఎగ్జిక్యూటివ్ హోదాలో ఉన్నాడు. ఈడూ-జోడూ బాగుంది. దాని జాతకంలో పెళ్ళయ్యే యోగం ఉందో, లేదో అసలు?!"

"నేను చెబితే వినిపించుకున్నారా?! 'దాన్ని ఆ ఇంజనీరింగ్ చదివించకండీ... ఏదో వానాకాలం చదువు పూర్తిచేస్తే ఎవడో గుమాస్తాగిరి వెలగబెట్టేవాడికి మన తాహతుకు తగ్గట్టు చేయవచ్చంటే విన్నారా? ఇప్పుడు చూడండి... దీనికన్నా పెద్దచదువు వాణ్ని వెదకాలి! పెద్దఉద్యోగస్తుడు దొరకాలి!! వాడికి తగ్గ కట్నాన్ని లంచంగా ఇస్తేనే గాని- ఇది ఈ గడప దాటేటట్టు లేదు. దీని సంగతి ఇలా అనుకుంటే... తరువాత మరో ఇద్దరు పెళ్ళంటూ రెడీ అవుతున్నారు. ఇదంతా ఏనాడో చేసుకున్న ఖర్మ!"

తీవ్రస్వరంతో రాగాలు తీస్తున్న అహల్యమ్మగారి వేదన అంజన హృదయాంతరాల్లోని ఊహల వెండివెన్నెల- మబ్బుల మాటు జాబిలిలా మసకబారి చల్లదనాన్ని కోల్పోతోంది.

ఒక్కసారి అంజన మానసవీణ మూగగా రోదించసాగింది.

'తనకేం తక్కువ? అందం... అణకువ... వివేకం... రూపలావణ్యం... వ్యక్తిత్వం... చదువు సంధ్యలు... ఏమి తక్కువని?' ఆలోచిస్తుంటే కోపంతో శరీరం కంపించసాగింది. ఆ పెళ్ళివారి మీద కోపం కట్టలు తెంచుకొస్తోంది.

"కుర్రాడు తన కూతురుకన్నా ఎక్కువ చదువుకొని పెద్దఉద్యోగం చేస్తున్నాడని మురిసిపోయారు. కానీ, మితిమీరిన దురాశ, విచక్షణ కోల్పోయిన వివేకం, పురుషాధిక్య ధోరణి మగాణ్ణి నైతికంగా పతనం చేస్తోంది."

- ఆలోచిస్తున్న అంజనకు తల్లిమాటల్లో ఎంతో నిజముందనిపించింది. తాను తక్కువగా చదువుకొని 'వంటింటి కుందేలు'గా మిగిలివుంటే వారికి తమపని సులభతరం అయ్యేది. కాని, ఇప్పుడు వారికి తాను ఎంతో బరువై వేదనను మిగిలిస్తోంది. తలచుకుంటున్న ఆ హృదయవేదన- నయనాలలో ప్రతిబింబిస్తూ నేత్రాల నుండి రెండు భారమైన కన్నీటి బిందువులు జాలువారాయి.

మధ్యతరగతి కుటుంబీకుడైన బంగారయ్య ఒక స్కూలు టీచర్! ముగ్గురు ఆడ సంతానం! మగ సంతానం లేని ఆ పిల్లలు నాన్న పంథానే అనుసరించారు. ఆ ఇంట్లో పెద్దగా లక్ష్మీప్రసన్నం లేకపోయినా- సరస్వతీ ప్రసన్నం మట్టుకు బాగానే ఉంది.

బంగారయ్యగారి మంచితనం, పరిణితి చెందిన వ్యక్తిత్వం పుణికిపుచ్చుకున్న పిల్లలు చదువు సంధ్యల్లో బాగానే రాణించారు. నాన్న పరపతిని ద్విగుణీకృతం చేసేలా మంచిమార్కులతో పాసవసాగారు.

పెద్దకూతురు 'అంజన' అంటే ఆయనకు ప్రాణం! బాగా చదువుకోవాలనే ఆమెలోని పట్టుదలను చూసి మురిసిపోయేవారు. అనుకున్నట్లుగానే ఎమ్. సెట్. ఎగ్జామ్‌లో మంచి ర్యాంక్

సాధించడంతో- ఇంజనీరింగ్‌లో సీటు ఆమెకు చాలా సులభంగా వచ్చింది. బాగా చదువుకోవాలనే పట్టుదల, జీవితం పట్ల ఉత్సాహం, అమ్మానాన్నల కలలను సాకారం చెయ్యాలనే వాంఛలతో ఆమె ఎకడమిక్ కేరియర్ రాగవంతమైంది.

కాలేజీలో లెక్చరర్స్‌కి ప్రియమైన శిష్యురాలిగా, తోటి స్టూడెంట్స్‌కి ఒక మోడల్‌గా నిలిచిన అంజన- తన వికసించిన వ్యక్తిత్వ పరిమళంతో అందరికీ మానవతా సుగంధాన్ని పంచి ఇచ్చేది. ఉక్కు క్రమశిక్షణతో అనుకున్నది సాధించిన ఆమె- ఇంజనీరింగ్‌లో మంచిమార్కులతో పాసై క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉన్నత ఉద్యోగాన్ని సంపాదించింది.

కూతురు ప్రయోజకత్వానికి అహల్యా, బంగారయ్యలు మురిసిపోతే- అక్కను ఆదర్శంగా తీసుకొని చెల్లెళ్ళు చదువు కొనసాగించేవారు.

ఇంజనీర్‌గా ఉద్యోగంలో స్థిరపడ్డ అంజనకు జీవితంలో స్థిరత్వం కోసం 'పెళ్ళివేట' మొదలుపెట్టారు. మంచి నడవడిక, స్వచ్ఛమైన పనితీరు, అరుదైన ఆత్మాభిమానం, చక్కనైన రూపలావణ్యం కలిగిన అంజన- తండ్రి మంచి మర్యాదలు, కుటుంబ గౌరవం, సాంప్రదాయాలకు ప్రాణమిచ్చేది.

రానురాను కూతురుపెళ్ళి ప్రతిబంధకం అయికూర్చుంది.

చిన్నసంబంధాలు చేయడం ఆయనకు ఇష్టంలేదు. కాబోయే అల్లుడికి అమ్మాయికి మించిన చదువు, పెద్దఉద్యోగం కలిగి ఉండాలని ఆశపడేవారు. అంతంత మాత్రమైన ఆర్థికస్థితి అస్సలు సహకరించడం లేదు. అమ్మాయి పదిహేనువేల రూపాయల ఉద్యోగస్తురాలైనా- 'కట్నం' లేనిదే తాళి కట్టమని పురుషపుంగవులు మొరాయిస్తూండటంతో కుమిలిపోసాగారు. నాన్న అంతరంగాన్ని అర్థంచేసుకోగల్గిన అంజన- అంతులేని హృదయవేదనతో సతమత మవసాగింది.

'యుక్తవయసులో తరుణికి వివాహం అనేది సహజం, అనివార్యం! మెచ్చినవ్యక్తితో సహజీవనం జీవితానికి అర్థాన్నిస్తుంది. తద్వారా బ్రతుకు సుఖమయ మవుతుంది. పెళ్ళిచూపుల తంతులో తాను ఎంతమంది ముందు 'బలిపశువు'లా కూర్చొంది? వచ్చిన ప్రతివాడు చదువుసంధ్యల గురించి, ఉద్యోగం, జీతభత్యాల గురించి తెలుసుకొని మెచ్చుకొనేవాడు. రేపు పెళ్ళి అయితే తన సంపాదన అతనిది కాదా?! కానీ, 'కట్నం' రూపంలో మరింత దండుకోవాలనే దురాశ! తనలాగ ఎందరు స్త్రీలు ఇలా విషవలయాల్లో చిక్కుకుంటున్నారో?! ఆడదానికి- తనకన్నా చదువుతక్కువ వాడైనా, జీతం తక్కువ వాడైనా భర్తగా చేసుకొంటే వచ్చిన నష్టమేమిటి? ఇంత చదువూ చెప్పించి, అంతకు అంతా డబ్బుపోసి, సంతలో పశువులా మొగుణ్ణి కొనుక్కోలేకపోతే వచ్చిన నష్టమేముంది? నిజం చెప్పాలంటే- ఇలాంటి దురాశాపరుల్ని మొగుళ్ళుగా చేసుకొని ఎంతమంది సుఖపడుతున్నారు? కేవలం 'రాజీ' పడుతున్నారంతే!'

– ఆలోచిస్తూన్న అంజన హృదయ తటాకంలో 'అజయ్' రూపం అందంగా కదలాడింది.

ఒక్కసారి తనువు, మనసు రాగరంజితమై పులకించసాగాయి.

అజయ్ ఒకప్పటి తన స్నేహితుడు, చిన్ననాటి క్లాస్‌మేట్! బంగారయ్యగారి ప్రియశిష్యుడు, చాలా తెలివైనవాడు! తనలా పైచదువులు చదివి ఉద్యోగం సంపాదించాలనే ఆశయం ఉన్నా- కుటుంబ బాధ్యతలు అతన్ని ముందడుగు వేయనీయలేదు. తండ్రి లేకపోవడం, తల్లి అనారోగ్యం, పెళ్ళి కావాల్సిన అక్కయ్యలు, కుటుంబ బాధ్యతలతో ఇరవైలో అరవైని అనుభవించాల్సి రావడంతో

మామూలు చదువులకే పరిమితమై ఏదో చిన్నవ్యాపారంలో స్థిరపడ్డాడు. అభిమానపూర్వకంగా అతను వ్రాసే ఉత్తరాలలో అంజన ఒక మంచిఆత్మీయుణ్ణి చూస్తూంటుంది.

'మనసెరిగి నడుచుకొనే అజయ్‌కి ఏమి తక్కువ? నెలకు పదివేల రూపాయలు సంపాదిస్తున్నాడు. మగాడికి ఆడదానికన్నా చదువు, ఉద్యోగం హెచ్చుస్థాయిలో ఉండాలన్న ఆంక్ష ఎక్కడుంది? తల్లిదండ్రుల ఆరాటం తప్ప– తనకు అటువంటి విషయాలపై విశ్వాసం లేదు. మనసెరిగి నడుచుకొనే భర్తకన్నా స్త్రీకి జీవితంలో ఆనందం ఇంకేముంటుంది?

అజయ్‌ని తన జీవితంలోకి ఆహ్వానిస్తే... అంతకన్నా ఆనందం ఇంకేముంటుంది?'

ఒకసారి విషయాన్ని మాటవరసకి అజయ్ ముందుంచితే అతను ఆనందంగా స్పందించాడు.

– ఆలోచిస్తూన్న అంజన గుండెను దిటవు చేసుకొని, అతని దగ్గరకు వెళ్లడానికి సమాయత్తమవుతూ తన మనసులో మాటను తండ్రికి ఉత్తర రూపంలో చెప్పసాగింది...

"నాన్నా! నేను బంగారంలాంటి పసిడివ్యక్తిత్వం గల బంగారయ్యగారి కూతుర్ని. నా నిర్ణయాన్ని మీరూ, అమ్మా హర్షిస్తారనే అనుకుంటున్నాను. మీరిచ్చిన ఈ శరీరం, చదువు, సంస్కారం, మంచిజీవితం ఇవన్నీ మీకు 'పెళ్ళి' పేరుతో ప్రతిబంధకాలుగా రూపాంతరం చెందడం భరించలేక పోతున్నాను. కూతురును పైచదువులు చదివించిన మీరు– మీకు అందుబాటులో ఉన్న వ్యక్తిని అల్లుడుగా తేవడం కన్నా, ఎన్నో వ్యయప్రయాసలతో ఎవరికో ఇచ్చి పెళ్ళి చెయ్యాలనుకోవడం మనకు భారం కాదా? నాకోసం అప్పుచేసి, లక్షలు గుమ్మరించి అత్తారింటికి పంపినా– చెల్లెళ్ళ టైము వచ్చేసరికి మీరెంత క్రుంగిపోతారో తలుచుకుంటే చాలా భయమేస్తోంది.

నేను మా ఆఫీసులో ఎవర్నో ప్రేమించి పెళ్ళిచేసుకునేందుకు నా మనసు అంగీకరించదు. కారణం... నేను మీ కూతుర్ని! కాని, అజయ్ మీరు మెచ్చిన మీ ప్రియశిష్యుడు. అతనికి ఏమీ లోటు లేదని నా భావన! నా అభ్యర్థనకి సానుకూలంగా స్పందించాడు. మీకు ముందుగా చెబితే మీ మనసు అంగీకరించదని తెలుసు. అందుకే నాన్నా! నాకన్నా తక్కువగా చదువుకున్న వ్యక్తితో సహజీవనం కోసం మీకు దూరమవుతున్నాను. పెళ్ళిచేసుకొని భర్తతో మీ దీవెన కోసం వస్తాను. తప్పక మా నూతన జీవితానికి మార్గం సుగమం చేస్తారని ఆశిస్తున్నాను.

ఇట్లు

మీ

అంజన"